# మంగళవారం – అష్టమి!

"అవంతీ! ఇన్నాళ్ళూ నీకు ఫోన్ చెయ్యలేదని కోపమొచ్చిందా? ఏం చెయ్యమంటావ్? మా మామగారికి ఆయాసం, దగ్గూ, బాగా ఎక్కువయిపోయి, ఆసుపత్రిలో చేర్చాం. దాదాపు పదిహేను రోజులు అక్కడే వుండి, నిన్ననే డిస్చార్జ్ అయి ఇంటికొచ్చారు. నిన్నటి వరకూ, ఇంటికీ ఆసుపత్రికీ తిరగడానికీ సరిపోయింది" అంది సాధన!

"అలాగా! ఇన్నాళ్లూ ఫోన్ చెయ్యకుండా వున్నందుకు యుద్ధం చేద్దామనుకున్నాను. రీజన్ చెప్పావు కాబట్టి క్షమించేశాను ఫో! అది సరే అసలు ఇంత గొడవ జరిగి సీరియస్ అయితే కనీసం అప్పుడు ఫోన్ చెయ్యొద్దూ, చాతనయిన సాయం చేసుండేవాళ్లం!" మళ్లీ నిష్ఠూరంగా అంది.

"అసలు తోచి ఛస్తేగా! ఆ రోజు మంగళవారం, అష్టమీ!"

"అయితే?" నవ్వింది సాధన!

"అందుకని, నోట్లోంచి నురగలుకారి, బి.పి. పెరిగి స్పృహతప్పుతూన్నా మా అత్తగారు, అతన్ని ఆసుపత్రిలో చేర్పించొద్దంటుంది. ఆ మందేదో ఇంటిదగ్గరే ఇప్పించమంటుంది. అన్నీ ఇంటి దగ్గర కుదరవుగా! ఆవిణ్ణి ఒప్పించడానికి, తల ప్రాణం తోకకొచ్చింది!"

"మైగాడ్! ఎంత ఫూలిష్‌నెస్! మరేం చేశారు? అడిగింది సాధన.

"ఏం చేస్తాం? ఎలాగో అలాగ ఒప్పించి ఆసుపత్రికి తీసుకెళ్లాం. ఆసుపత్రిలో కాలు పెట్టగానే అతనికి స్పృహ పూర్తిగా పోయింది. డాక్టర్లు ఏవేవో ఇంజక్షన్సిచ్చి తర్జన భర్జన పడసాగారు. దాంతో మా అత్తగారి మాటలు 'మంగళవారం అష్టమీ' గుర్తుకొచ్చి మాకు పిచ్చెత్తినట్టయింది. నిజంగానే అతడికేమైనా అయిపోతే? మా అత్తగారు మమ్మల్ని జీవితాంతం ఆడిపోసుకునేవారు. అతనికి ప్రమాదం ఆటోమాటిక్‌గా వొచ్చిందని అనుకోకుండా, మంగళవారం అష్టమి వల్లే వొచ్చిందని

మమ్మల్ని చంపేసి వుండేవారు! మనసులో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కూర్చున్నామంటే నమ్ము! అక్కడికీ ఆవిడ సణుగుతూనే ఉంది! "ఈ డాక్టర్లకేం? ఇలాగే చెబుతారు. ఒక్కరోజు ఇంట్లో మందులు వేసి రేపు చేర్పిస్తే పోయేదిగా!" అంటూ ఆవిడ మంగళ సూత్రాలు తీసుకుని కళ్ల కద్దుకుంటూ కంట తడిపెడుతూ కూర్చునేసరికి మాకు నిజంగా ఎంత భయమేసిందో చెప్పలేను. మంచినీళ్లయినా తాగకుండా ఇంటిల్లిపాదీ అక్కడే కూర్చున్నాం. అయితే దాదాపు సాయంత్రం అయిదు గంటలకి, ఆయనకి స్పృహ వొచ్చింది.

ఇంక ప్రమాదం లేదన్నారు డాక్టర్లు! అంతేకాదు! మీరు వెంటనే హైంకి ఆసుపత్రిలో చేర్పించారు గాబట్టి సరిపోయింది. లేకపోతే చాలా డేంజర్ జరిగిపోయేది" అన్నారు. నేనూ మా ఆయనా మా అత్తగారి కేసి చూశాం. మంగళవారం అష్టమీ, గుర్తుచేస్తున్నట్టుగా! ఆవిడ ఇదేదీ పట్టనట్టు అతనికి ఎంత ప్రమాదం ఎలా ముంచుకొచ్చిందో, ఎలా దాటిపోయిందో అంతా పక్కవాళ్ల కెవరికో చెబుతోంది!"

"ఎంత సిల్లీ అవంతీ! ఈ రోజుల్లో కూడా ఇంకా ఇంత మూఢ నమ్మకాలల్లో మనుషులు మగ్గి బుగ్గయిపోతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది. మంగళవారం హనుమంతుడి రోజని పూజలు వ్రతాలూ చేస్తారు. అష్టమి, దుర్గాష్టమిగా, కృష్ణాష్టమిగా, పర్వదినాలనీ పండగలనీ జరుపుకుంటారు. కానీ మామూలు పన్లకి మంగళవారం మంచిది కాదని, అష్టమి నష్టమనీ చెబుతారు. ఈ రెండికీ పోలికెక్కడ? అసలు అలా ఎందుకు నమ్ముతారో అర్థం కాదు" అంది సాధన!

"చదువు సంధ్యలు లేని వాళ్ల సంగతి ఒదిలిపెట్టు. అన్నీ తెలిసినవాళ్లూ విద్యావంతులూ కూడా ఇలా ప్రవర్తించడం చాలా హాస్యాస్పదం కదూ?" అంది అవంతి.

"మరి అడక్కపోయావా? మీ అత్తగారిని? మంగళవారమయినా, అష్టమయినా ఆసుపత్రికి తీసికెళ్లాం గనకనే గండం గడిచిందని!" అంది సాధన.

"అడిగితే మమ్మల్నే ఆడిపోసుకుంటుంది" అంది అవంతి.

"అంటే ఇప్పటికీ ఆమె అనుమానాలు పోలేదన్న మాట!" అంది సాధన ఆశ్చర్యంగా!

పకపకా నవ్వింది అవంతి!

"పిచ్చిదానా! ఆరుకోట్ల ఆంధ్రులలో కనీసం అయిదు కోట్ల తొంభై తొమ్మిది మందికైనా ఇట్లాంటి అనుమానాలు వుంటాయి. మా అత్తగారొక్కరే కాదు. పోనీ ఆవిడ పెద్దగా చదువుకోలేదూ పాత కాలం మనిషీ అనుకుందాం. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లూ అందరిలోనూ వుంది ఈ ఛాదస్తం!"

"అసలు ఈ ఛాదస్తాలూ ఆడాళ్లకే ఎక్కువనుకుంటా" అంది మళ్లీ సాధన!

"నీ మొహం! మొగాళ్లకీ వుంది. మా పక్కింటాయన శుక్రవారం నాడు నయాపైసా ఖర్చుపెట్టడు. లక్ష్మిని దానం చేసినట్టవుతుందట. అప్పులవాళ్లకి అంటె అద్దె వాళ్లకి అద్దె ఇవ్వడు. ఏమైనా అర్జంటుగా కొనాల్సొచ్చినా అలమారలోంచి పైసా తియ్యడు. ఒకరోజు శుక్రవారం వాళ్లింటికి చుట్టాలొచ్చారు. సమయానికి పంచదార అయిపోయిందట ఇంట్లో! డబ్బులిచ్చి కొనాలంటే రామనాథం గారు శుక్రవారం డబ్బు తియ్యనియ్యరుగా? అందుకని మా ఇంటికొచ్చి బదులు తీసికెళ్లిందావిడ. ఇట్లాంటి వాళ్లని ఏమనాలి?" నవ్వింది అవంతి.

*